క్లుప్తంగా

రేపల్లె మున్సిపల్ రెవెన్యూ అధికారిణిగా రత్నాంజలి



రేపల్లె రూరల్: రేపల్లె మున్సిపల్ రెవెన్యూ అధికారిగా రత్నాంజలి ఉద్యోగ బాధ్యతలు శనివారం స్వీకరించారు. జగ్గయ్యపేట నుంచి సాధారణ బదిలీపై రేపల్లెకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీలక్ష్మి జగ్గయ్యపేటకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రత్నాంజలి ఎంపీ మోపిదేవి వెంకట రమణారావును ఆయన వ్యక్తిగత కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే బాపట్ల జిల్లా పంచాయతీ రాజ్ అధికారిగా నూతనంగా నియమితులైన దాసరి రాంబాబు ఎంపీ మోపిదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రసవత్తరంగా వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నీ



కొల్లూరు : వైఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నీ రసవత్తరంగా సాగుతోంది. కొల్లూరు బాలుర, బాలికల ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో పలు జట్లు శనివారం తలపడ్డాయి. బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ యూత్ విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్‌నాగ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నీ మూడో రౌండ్‌లోకి ప్రవేశించింది. కొల్లూరు పోనెక్స్ జట్టుపై తలపడిన పోతార్లంక జట్టు విజయం సాధించగా, అబ్బన గూడవల్లి జట్టుపై దుండిపాలేనికి చెందిన జై దుర్గా భవానీ జట్టు గెలుపొందింది. తురుమెళ్ల అంబేడ్కర్ యూత్ జట్టుపై పోటీపడిన పల్లెకోనకు చెందిన లాయర్ శ్రీను యూత్ జట్టు విజయాన్ని సొంతం చేసుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

బండ్లమ్మ సేవలో డీపీఓ రాంబాబు



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసిన బగళాముఖి అమ్మవారిని బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి దాసరి రాంబాబు, ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ శనివారం దర్శించుకొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు బండ్లమ్మను దర్శించుకుని, బాధ్యతలు స్వీకరిస్తే.. మంచి జరుగుతుందన్నారు. ఆయనకు దేవాదాయశాఖ అధికారి నరసింహమూర్తి అమ్మవారి జ్ఞాపికను అందజేసి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరీదేవి విజయకుమారి, మునీర్, కార్యదర్శి శేషగిరిరావు, ఈఓపీఆర్డీ పద్మజ తదితరులు ఉన్నారు.

క్రీడా రంగ అభివృద్ధికి డాక్టర్ స్వరూప్ కృషి ఎనలేనిది



బాపట్ల: క్రీడా రంగం అభివృద్ధికి డాక్టరు కేఎల్ స్వరూప్ చేసిన కృషి ఎనలేనిదని ఏపీ మాస్టర్స్ అథ్లెట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్.లాల్ వాజీర్ పేర్కొన్నారు. డాక్టరు కేఎల్ స్వరూప్ సంస్మరణ సభ స్థానిక రోటరీ క్లబ్‌లో శనివారం జరిగింది. షేక్.లాల్‌వాజీర్ మాట్లాడుతూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా వేల మంది క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయస్థాయిలో తీర్చిదిద్ది.. పతకాలు సాధించడంలో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి షేక్.నజీర్, ఆనందరావు, రవికుమార్, నాగరాజు, శ్రీమన్నారాయణ, సుబ్బారావు, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం

తెనాలిరూరల్: పిల్లలు సహా తల్లి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పాండురంగ పేటకు చెందిన గరికపాటి సరిత కుమారుడు గణేష్(14), కుతురు దీక్షిత(12)ను తీసుకుని ఈ నెల 8న ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ కోసం ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఆమె భర్త శనివారం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీ టౌన్ ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీకి జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళ్తున్న లారీకి అధికారులు జరిమానా విధించారు. కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం వద్ద అధిక ఇసుక లోడుతో వెళ్తున్న లారీని ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, తన సిబ్బందితో శనివారం గుర్తించారు. లారీ యజమానికి రూ.22 వేల జరిమానా విధించారు.

బాపట్ల పారిశుద్ధ్యానికి పెద్దపీట

- పట్టణంలో నెల రోజులు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు
- ప్రారంభించిన ఎమ్మెల్యే కోన రఘుపతి



ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: బాపట్ల పట్టణంలో పూర్తిస్థాయిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. నెల రోజులు పాటు డ్రెయినేజీల్లో పూడిక తీత, చెత్తచెదారం తొలగింపు పూర్తి స్థాయిలో చేయనున్నట్టు వివరించారు. పారిశుద్ధ్య పనులను శనివారం ఆయన ప్రారంభించారు. పట్టణంలోని డ్రెయినేజీలను మూడు భాగాలుగా విభజించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మైనర్ డ్రెయినేజీలు 89 కిలోమీటర్లు, మీడియం డ్రెయినేజీలు 25 కిలోమీటర్లు, మెయిన్ డ్రెయినేజీలు 70.7 కిలోమీటర్లు చొప్పున శుభ్రం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని వెల్లడించారు. పూడిక తీత వల్ల ఎక్కడా మురుగు, వర్షపు నీరు నిల్వలేకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవటం జరిగిందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ ఆదేశాల మేరకు సచివాలయం ఉద్యోగులు పూర్తి స్థాయిలో ఈ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్ మాట్లాడుతూ డ్రెయినేజీల్లో పూడిక తీతకు సంబంధించి గుంటూరు నుంచి 30 మంది కార్మికులను తీసుకురావటం జరిగిందన్నారు. ఈ డ్రైవ్‌కు పుర ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, టీపీఓ శ్రీలక్ష్మీ, వైఎస్సార్ సీపీ నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, రంగారావు, కొత్రా ఏడుకొండలు, గేరా మణిభూషన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతో ప్రతి ఇంట ఆనందాల హరివిల్లు

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- రేపల్లె పట్టణం 13వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ లబ్ధిని మహిళలకు వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

రేపల్లె: జగనన్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటి ముంగిట ఆనందాల హరివిల్లు పలుకరిస్తోందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 13వ వార్డులో శనివారం రెండవ రోజు ఆయన పర్యటించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రతి పేదవానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎంపీ మోపిదేవి ఈ సందర్భంగా తెలిపారు. సచివాలయ వ్యవస్థతో పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి పక్షాలు ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఇచ్చిన హామీలే గాక.. కొత్త పథకాలను కూడా ప్రవేశ పెట్టి నూరు శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. తమకు ముఖ్యమంత్రిగా జగనన్నే కావాలని ప్రజల కోరుకుంటున్నారని చెప్పారు. వార్డులో 210 గృహాలను ఎంపీ మోపిదేవి సందర్శించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీ విశ్వనాథగుప్త, మాజీ కౌన్సిలర్ చెన్ను లక్ష్మణరావు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించడం తప్పనిసరి

రూరల్ సీఐ శివశంకర్



వాహనదారులతో ప్రమాణం చేయిస్తున్న సీఐ శివశంకర్, ఎస్సై కొండారెడ్డి

చెరుకుపల్లి: వాహనదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని రేపల్లె రూరల్ సీఐ ఎ.శివశంకర్ హెచ్చరించారు. శనివారం 216ఏ జాతీయ రహదారిపై నో-యాక్సిడెంట్ డే సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, విధిగా హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని వాహనదారులతో ప్రమాణం చేయించారు. అలాగే మండలంలోని రెండు టపాసుల గోదాంలను సీఐ తన సిబ్బందితో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, బిల్లులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై డి.కొండారెడ్డి, ఏఎస్సైలు శ్రీనివాసరావు, బ్రహ్మం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పుస్తకాలు, ఉపకార వేతనాలు పంపిణీ

భట్టిప్రోలు: ఆర్యవైశ్య విద్యా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం 9 గంటలకు షిర్డీ సాయిబాబా ఆలయంలో 34వ మహాజన సభ జరుగుతుందని కార్యదర్శి మానేపల్లి సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 6వ తరగతి నుంచి బీటెక్ వరకు చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు అర్జీలు పెట్టుకున్న 130 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

రంజింప జేసిన సంగీత కచేరి

తెనాలి: హేమాద్రి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక రామలింగేశ్వరపేటలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన సంగీత కచేరి రంజింపజేసింది. గానవిదుషి గద్దె వెంకట రామకుమారి అష్టమ స్మారక సంగీతోత్సవంగా ఈ కచ్చేరీలో నిర్వహించారు. స్నిగ్ధమోహన గాత్రంతో కచేరి ఆరంభమైంది. తొలుత మోహన వర్ణంతో మొదలుపెట్టి, హంసధ్వని రాగంలో వాతాపి గణపతి, జయంతి శ్రీరాగంలో మరుగేలరా వంటి వాగ్గేయకారుల కీర్తనలతో సభను రంజింపజేశారు. వీరికి వయొలిన్‌పై హేమాద్రి చంద్రకాంత్, మృదంగంపై బి.సురేష్‌బాబు, ఘటంపై ఎం.హరిబాబు సహకరించారు. అనంతరం ద్రోణేంద్ర ఫణి కుమార్ వేణునాదంతో అహుతులను అలరించారు. రామకుమారి శిష్యబృందం ఈ కచేరి నిర్వహించినట్టు అకాడమీ అధ్యక్షుడు ఎం.కోదండరామశాస్త్రి తెలియజేశారు.

ప్రారంభ రోజే 'విద్యా కానుక'



పిట్టలవానిపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పాఠశాల పునఃప్రారంభ రోజునే జగనన్న విద్యా కానుక కిట్లను అందజేయడం జరుగుతుందని బాపట్ల డీఎల్‌డీఓ చంద్ర సువార్త తెలిపారు. ఖాజీపాలెం మంతెన సుబ్బరాజు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యాకానుక కిట్లను పరిశీలించి, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ, ఈవోపీఆర్డీ పద్మజ, గ్రామ కార్యదర్శులు శ్రీనివాసరావు, గోపి, వెంకటరెడ్డి ఉన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు



మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. చాత్రగడ్డ గ్రామంలోని ఎస్‌వీఎస్ స్కూలు బాధ్యతలు ఇటీవల విజయవాడకు చెందిన శ్రీ సరస్వతీ విద్యామందిర్ స్వీకరించింది. శనివారం పాఠశాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సరస్వతీ విద్యామందిర్ తీరప్రాంతమైన రేపల్లె మండలంలో పాఠశాలను నిర్వహణ బాధ్యతలు తీసుకోవటం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు ఎటువంటి మానసిక ఒత్తిడి కలగకుండా నాణ్యతతో కూడిన విద్యను అందించాలని కోరారు. కార్యక్రమంలో బావుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్ కృష్ణ చంద్ర, ఉపాధ్యక్షుడు నారాయణరావు, కార్యదర్శి కన్నెగంటి రామరాయ చౌదరి, సహ కార్యదర్శి దుగ్గిరాల అశోక్‌కుమార్, కోశాధికారి వెంకటప్పయ్య, సభ్యులు డాక్టర్ రాజగోపాల్, నార్ల సాయన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణంలో ఇబ్బందులుంటే చెప్పండి

ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి డాక్టర్ హనుమంతరావు, అధికారుల బృందం

భట్టిప్రోలు: గృహ నిర్మాణాలు చేపట్టడానికి ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని మండల ప్రత్యేక, బాపట్ల జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు కోరారు. వెల్లటూరు జగనన్న లే-అవుట్‌లో లబ్ధిదారులుతో అధికారుల బృందం శనివారం భేటీ అయ్యింది. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించినా ఇంత వరకు గృహ నిర్మాణాలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రావాలని కోరారు. ఇందుకోసం ఐరన్, ఇసుక, సిమెంటు, గృహ నిర్మాణ సామగ్రితో పాటు అదనంగా స్వయం సహాయక సంఘాలలో ఉన్న మహిళలకు రూ. 35 వేలు అందించడం జరుగుతుందని చెప్పారు. లబ్ధిదారుల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లెంట్లు, స్లాబ్ లెవెల్‌లో ఆర్థిక పరమైన ఇబ్బందులుంటే రూ. 35 వేలు నుంచి రూ. 50 వేల వరకు రుణం ఇప్పించనున్నట్లు చెప్పారు. గృహ నిర్మాణ పట్టాదారుడు మృతి చెందినట్లయితే వారి కుటుంబ సభ్యుల పేరుతో పట్టాలు ఇప్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, తహసీల్దారు ఎంఎల్ శ్రావణ్‌కుమార్, హౌసింగ్ ఏఈ రావూరి సౌమ్య, పంచాయతీ రాజ్ ఏఈ శేతు రామచంద్రరరావు, పంచాయతీ కార్యదర్శి ఎ.రామ్ కుమార్, బొర్రా శ్రీనివాసరావు, వీఆర్వో ఎం.వినూష, యానిమేటర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పూరిళ్లు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



ప్రమాదంలో దగ్ధమైన పూరిల్లు

రేపల్లె: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సంభవించిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన పట్టణంలోని 3వ వార్డులో శనివారం ఉదయం చోటు చేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి సాంబ శివరావు వివరాల మేరకు 3వ వార్డులో అద్దెకు ఉంటున్న సత్యనారాయణ గృహంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కారణంగా మంటలు ఎగసిపడ్డాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపుచేశారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. బాధిత కుటుంబాన్ని వార్డు కౌన్సిలర్ చదలవాడ శ్రీనివాసరావు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కట్టా సుబ్బారావు బాధితులకు రూ.2వేల ఆర్థిక సాయం అందజేశారు. అగ్ని ప్రమాదం గురించి తెలుసుకున్న శ్రీ దత్తాత్రేయ బ్రాహ్మణ సమాఖ్య సంఘం సభ్యులు అగ్నిప్రమాద బాధితుడు సత్యనారాయణకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వడ్లమూడి ఉదయ ప్రసాద్, కార్యదర్శి పీఎస్‌బీ వర్మ, కోశాధికారి రొంపిచర్ల విజయసారథి, కొండవీటి అగస్త్య, రామకృష్ణ తదితరులున్నారు.

పోతార్లంకలో..

కొల్లూరు : అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన పోతార్లంకలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పరిశ సీతామహాలక్ష్మి అనే వృద్ధురాలు నివసిస్తున్న పూరింటి నుంచి మధ్యాహ్నం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి, ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిని బయటపడికు తీసుకొచ్చి కాపాడారు. మంటలను స్థానికులు అదుపుచేసేందుకు ప్రయత్నించినప్పటికీ..ఇల్లు పూర్తిగా కాలిపోయింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదంలో సుమారు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం ఉంటుందని బాధితురాలు సీతామహాలక్ష్మి తెలిపారు.

పెరియార్-సమకాలీనత సదస్సు కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరించిన విల్సన్

తెనాలి: మతాలు, కులాలుగా ప్రజలు విడిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పెరియార్ ఆలోచనలు సమాజానికి చాలా అవసరమని పెరియార్-అంబేడ్కర్-పూలే-జాషువా ఫౌండేషన్ చైర్మన్ బత్తుల విల్సన్ పేర్కొన్నారు. పెరియార్ ఆలోచనలు, సిద్ధాంతాలను నేటి తరానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో పెరియార్-సమకాలీనత సదస్సులను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 16న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సదస్సుకు జన సమీకరణ పర్యటనలో భాగంగా శనివారం తెనాలి వచ్చిన ఆయన, స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రం ఆవరణలో సదస్సు కర పత్రాన్ని ఆవిష్కరించారు. లౌకికవాదం ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న నేటికాలంలో కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, పిట్టు కోటేశ్వరరావు, కె.రవికుమార్, దేవరపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను సచివాలయ పరిధిలోనే గుర్తించాలి

తెనాలి: కౌలు రైతులను గ్రామ సచివాలయ పరిధిలోనే అధికారులు గుర్తించి, గ్రామ సభల ద్వారా పంటసాగు హక్కు పత్రాలను ఇవ్వాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 7న నెల్లూరులో ప్రారంభమైన కౌలు రైతు సంఘం ప్రచార యాత్ర శనివారం పట్టణంలోని అయితానగర్‌కు చేరుకుంది. మహిళా పాడి రైతులు, కౌలు రైతులు జాతకు స్వాగతం పలికారు. రైతు సంఘ నేత ములకా శివ సాంబిరెడ్డి అధ్యక్షత వహించిన సభలో రాధాకృష్ణ మాట్లాడుతూ, కౌలు రైతుల చట్టంలో భూమి యజమాని సంతకం చేయాలనే నిబంధన విధించటంతో కౌలు రైతులు నష్టపోతున్నారని చెప్పారు. యజమానులు అంగీకార పత్రంపై సంతకం చేయకపోవటంతో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రావటం లేదని పేర్కొన్నారు.

రైతుకు నిజమైన భరోసా..

- పల్లె దాటని సమస్యలు.. కష్టం తేవని కేంద్రాలు
- రైతుకు నిజమైన ఆపద్బాంధవం..
- ఆర్బీకేల్లోనే సకల సేవల సమాహారం



జంపని రైతు భరోసా కేంద్రం

వేమూరు: రైతు భరోసా కేంద్రాలు. ఒక విప్లవాత్మక మార్పునకు శ్రీకారం. రైతు కష్టం పల్లెదాటకుండా.. సాగులో నష్టం రాకుండా.. అన్ని రకాల సేవలు ఒక కేంద్రంగా అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్బీకేలు సత్ఫలితాలిస్తున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆలోచనకు అనుగుణంగా ముందుకు సాగుతున్నాయి. రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు దళారీ కబంధ హస్తాల నుంచి సన్న, చిన్నకారు రైతులను ఆర్బీకేలు కాపాడుతున్నాయి. సకాలంలో ఎరువులను అందుబాటులో ఉంచి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాయి.

వేమూరు మండలంలో ఇలా..

వేమూరు మండలంలో 14 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఆర్బీకేల ద్వారా గతేడాది డీఏపీ 465 టన్నులు, 20-20 100 టన్నులు, 10-26-26 - 20 టన్నులు, యూరియా 2046.28 టన్నులు మొత్తం 2631.28 టన్నుల ఎరువును రైతులకు అందించడం జరిగింది. ఈ ఏడాది కూడా రైతులకు ఎరువులు అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. పచ్చి రోట్ట ఎరువులు ఏటా 119 టన్నులు అందించడం జరుగుతుందని వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. రైతు భరోసా కేంద్రాల సాగులో మెళకువలపై అవగాహన కల్పిస్తున్నారు. రైతు గ్రూపులను ఏర్పాటు చేసి, యంత్ర సేవ పథకం ద్వారా యంత్రాలను ప్రభుత్వం అందజేస్తోంది.

రైతులకు మేలు..



సాగుకు ముందు రైతు భరోసా నగదు అందుతోంది. అకాల వర్షాలకు పంట నష్టపోతే పరిహారం వెంటనే వస్తోంది. ఇన్సూరెన్స్ నగదు సకాలంలో ఇస్తున్నారు.

తాడిబోయిన అంకమ్మరావు,
రైతు, జంపని.

పంటకు మద్దతు ధర..



రైతు పండించిన పంటకు ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేశారు.

పేర్ల ఏడుకొండలు,
రైతు, జంపని.